క్లుప్తంగా

విద్యార్థులకు వితరణ



విద్యార్థులకు సామగ్రి అందజేస్తున్న సత్యనారాయణ

కడియం: రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత గొల్లపల్లి సత్యనారాయణ తన తండ్రి మూలయ్య 12వ వర్ధంతిని పురస్కరించుకుని స్థానిక బాలికల వసతి గృహంలో విద్యార్థులకు పరీక్షలు రాయడానికి అవసరమైన సామగ్రి, నిత్యావసర వస్తువులను బుధవారం పంపిణీ చేశారు. చదువుతో పాటు క్రీడల్లో రాణిస్తున్న పదోతరగతి విద్యార్థిని శిరీషకు నగదు బహుమతి ఇచ్చారు. హాస్టల్ వార్డెన్ పడాల సుదర్శన, సిబ్బంది, విజయ్‌భాస్కర్, సిరి, హైస్కూలు పీడీ ఎం.డేవిడ్ పాల్గొన్నారు.

వైభవంగా శ్రీపుష్పమహోత్సవం

కడియం: దుళ్లలోని రుక్మిణీ సత్యభామా సమేత మదనగోపాలస్వామి కల్యాణ మహోత్సవాల్లో భాగంగా బుధవారం రాత్రి శ్రీపుష్పమహోత్సవం వైభవంగా నిర్వహించారు. ఆలయ అర్చకుడు శ్రీమాన్ ఖండవిల్లి రాధాకృష్ణమాచార్యులు ఆధ్వర్యంలో వేదపండితులు ఈ కార్యక్రమం జరిపారు. విశేష సంఖ్యలో భక్తులు హాజరయ్యారు.

పారిశుధ్య కార్మికులకు సత్కారం

కడియం: మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని కడియపులంకలో పారిశుధ్య కార్మికులను సత్కరించారు. పంచాయతీ 13వ వార్డు సభ్యురాలు, జనసేన జిల్లా ప్రధాన కార్యదర్శి బోడపాటి రాజేశ్వరి.. కార్మికులను పూలమాలలతో సత్కరించి, స్వీట్లు పంపిణీ చేశారు. గ్రామంలో పారిశుధ్యం మెరుగునకు వీరు చేస్తున్న కృషిని అభినందించారు.

జాంపేట స్కూల్ అభివృద్ధికి రూ.లక్ష విరాళం

కంబాలచెరువు: జాంపేట లూథరన్ హైస్కూల్ ప్రహరీ శిథిలమైన నేపథ్యంలో దాని పునర్నిర్మాణానికి ధవళేశ్వరానికి చెందిన క్లాస్‌వన్ కాంట్రాక్టర్ గాలి సుబ్బరాజు బుధవారం రూ.లక్ష విరాళం ఇచ్చారు. ఆయన మాట్లాడుతూ ఈ పాఠశాల విద్యార్థి కాకపోయినా స్కూల్ అభివృద్ధికి విరాళం ఇవ్వడం సంతోషంగా ఉందన్నారు. కరస్పాండెంట్ ఐ.జయ మాట్లాడుతూ ప్రహరీ నిర్మాణం కోసం స్టాఫ్ కార్యదర్శి మార్టిన్ సుధాకర్, ఉపాధ్యాయులు ఎంతోమంది ప్రముఖులను, రాజకీయ నాయకులను కలిసి సహాయం చేయాలని కోరామన్నారు. దీనిపై దాత గాలి సుబ్బరాజు స్పందించి రూ.లక్ష విరాళం ఇవ్వడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో సుదర్శన్ షాపింగ్ మాల్ అధినేత లావేటి సుదర్శనం, పూర్వ విద్యార్థి షేక్ చాన్ బాషా, జేఏసీ బీసీ, ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనారిటీ ఉద్యోగుల రాష్ట్ర అధ్యక్షుడు కేతా శ్రీనివాసరావు, ప్రముఖ వ్యాపారవేత్త శ్రీరాములు, పూర్వ విద్యార్థి ఖలీల్ పాల్గొన్నారు.

బ్లడ్ క్యాన్సర్‌ను నయం చేయవచ్చు



మాట్లాడుతున్న డాక్టర్ గణేష్ జైశట్వార్

కంబాలచెరువు: బ్లడ్ క్యాన్సర్ వస్తే జీవితం అయిపోయిందనుకోవడం పూర్తి అపోహ అని, ఆ వ్యాధిని నయం చేసి మనిషిని సాధారణ స్థితికి తీసుకు రావచ్చని సీనియర్ హెమాటాలజిస్టు, యశోద హాస్పిటల్స్ వైద్య నిపుణుడు, బోన్ ట్రాన్స్‌ప్లాంటేషన్ ఫిజిషియన్ డాక్టర్ గణేష్ జైశట్వార్ చెప్పారు. జిల్లాలో బ్లడ్ క్యాన్సర్‌తో బాధపడుతున్న పలువురికి ఆయన వైద్యం చేశారు. ఈ నేపథ్యంలో బైపాస్ రోడ్డులోని యశోద హాస్పిటల్ మెడికల్ సెంటర్‌లో రాజమండ్రి బ్లడ్ క్యాన్సర్ సర్వైవర్స్ మీట్ నిర్వహించారు. డాక్టర్ గణేష్, డాక్టర్ రేష్మా తమరి అనుభవాలను చెప్పారు. డాక్టర్ గణేష్ జైశట్వార్ మాట్లాడుతూ బ్లడ్ క్యాన్సర్‌పై ప్రజలకు అపోహలను తొలగించి అవగాహన పెంచేందుకు కృషి చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో జనరల్ మేనేజర్ శ్రీనివాస్, మేనేజర్ పరమేశ్, అసిస్టెంట్ మేనేజర్ సంజీవ్ కుమార్ పాల్గొన్నారు.

మహిళాభ్యున్నతికి అత్యంత ప్రాధాన్యం



కలెక్టర్ మాధవీలతను సత్కరిస్తున్న పశుసంవర్ధకశాఖ మహిళా ఉద్యోగులు



నగరంలోని మహిళా హెవెన్ వద్ద కేక్ కట్ చేస్తున్న రుడా చైర్‌పర్సన్ మేడపాటి షర్మిలారెడ్డి, విద్యార్థులు



ధవళేశ్వరంలో మహిళలకు చీరలు పంపిణీ చేస్తున్న చందన నాగేశ్వర్, వర్ధిని దంపతులు

- వారి పేరు మీదే ప్రభుత్వ పథకాలు
- కలెక్టర్ మాధవీలత
- ఘనంగా మహిళా దినోత్సవం

అల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): మహిళల అభ్యున్నతికి రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, వారిపేరు మీదే ప్రభుత్వ పథకాలను అందిస్తోందని డాక్టర్ కె.మాధవీలత అన్నారు. స్థానిక జిల్లా పశుసంవర్ధకశాఖ కార్యాలయంలో బుధవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన కలెక్టర్ జ్యోతిప్రజ్వలన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లో ముందుంటున్నారని, ఒకవైపు ఉద్యోగ బాధ్యతలు, మరోవైపు కుటుంబ నిర్వహణను సమర్థంగా చేస్తున్నారన్నారు. ప్రతి మహిళా దిశ యాప్‌ను తమ మొబైల్ ద్వారా వినియోగించాలని కార్యక్రమానికి హాజరైన మహిళలకు సూచించారు. అలాగే నూతనంగా ఏర్పాటు చేసిన క్రీడా ప్రాంగణాన్ని లాంఛనంగా ప్రారంభించి, కొంతసేపు షటిల్ బ్యాడ్మింటన్ ఆడారు.

మహిళల కృషి అభినందనీయం

ఆర్డీవో ఎస్.మల్లిబాబు మాట్లాడుతూ మహిళలు సైకిల్ మొదలు యుద్ధ విమానం నడిపే వరకూ ప్రావీణ్యం సంపాదించారన్నారు. ఈ సందర్భంగా వారి కృషిని అభినందించారు. సభకు అధ్యక్షత వహించిన జిల్లా పశుసంవర్ధక శాఖాధికారి డాక్టర్ ఎస్‌జీటీ సత్యగోవింద్ మాట్లాడుతూ పశుసంవర్ధకశాఖలో 50 శాతం మించి మహిళలు ఉండడం, వారి ఆర్థిక సాధికారతకు అద్దం పడుతోందన్నారు. అడ్వకేట్ సూర్యప్రభావతి మాట్లాడుతూ మహిళల చట్టాలను, వారు విధి నిర్వహణలో ఎదుర్కొంటున్న సమస్యలను ఎలా అధిగమించాలో వివరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ డాక్టర్ కె.మాధవీలతను పశుసంవర్ధకశాఖ అధికారులు, సిబ్బంది ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో డాక్టర్ ఎస్.రూపకళ, డాక్టర్ లావణ్య, డాక్టర్ ప్రభావతి, ఉపసంచాలకులు, ఏపీ రాష్ట్ర వెటర్నరీ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు డాక్టర్ కె.సత్యనారాయణ, తూర్పు గోదావరి జిల్లా వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్స్ సర్వీస్ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ ఎంఎస్ఎన్ మూర్తి, డాక్టర్ ఏవీవీ ప్రసన్న కుమార్ పాల్గొన్నారు.

సత్తా చాటుతున్న మహిళలు

ధవళేశ్వరం: మహిళలు అన్నింటా సత్తా చాటుతున్నారని ఆంధ్రప్రదేశ్ గ్రీనింగ్, బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ చైర్మన్, వైఎస్సార్ సీపీ రాజమహేంద్రవరం రూరల్ కోఆర్డినేటర్ చందన నాగేశ్వర్ అన్నారు. బుధవారం ధవళేశ్వరంలో సచివాలయం -3 కన్వీనర్ కల్యాణి రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన అంతర్జాతీయ మహిళా దినోత్సవానికి చందన నాగేశ్వర్, డాక్టర్ చందన వర్ధిని దంపతులు ముఖ్యఅతిథులుగా విచ్చేశారు. ఈ సందర్భంగా నాగేశ్వర్ మాట్లాడుతూ మహిళలు పురుషులతో సమానంగా అన్నింటా ముందుంటున్నారన్నారు. డాక్టర్ వర్ధిని మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మహిళా సాధికారతకు పెద్దపీట వేస్తున్నారని కొనియాడారు. అనంతరం మహిళలకు, మహిళా వలంటీర్లకు చందన నాగేశ్వర్, వర్ధిని దంపతులు చీరలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో హితకారిణి సమాజం డైరెక్టర్ దేవులపల్లి సరితారాణి, వైఎస్సార్ సీపీ జిల్లా ట్రేడ్ యూనియన్ అధ్యక్షుడు ముద్దాల అను, వక్ఫ్‌బోర్డ్ డైరెక్టర్ షట్టర్ బాషా, జేసీఎస్ కన్వీనర్లు తడాల చక్రవర్తి, తాటికొండ విష్ణుమూర్తి, సచివాలయ కన్వీనర్లు తలారి వరప్రసాద్, గోలి దేవకుమార్, ధర్మ, రేగుళ్ల రాజు, మెండా రాజేష్, ఎస్వీ శేఖర్, గూటం రాజు, నంబూరి రవి, చెల్లయ్యమ్మ, పట్టపగలు వెంకటలక్ష్మి పాల్గొన్నారు.



ధవళేశ్వరం సీఐ మంగాదేవిని సన్మానిస్తున్న బేసిక్ మెడికల్ ప్రాక్టీషనర్స్ అసోసియేషన్ సభ్యులు

- ది ఏపీ స్టేట్ బేసిక్ మెడికల్ ప్రాక్టీషనర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం ధవళేశ్వరం పోలీస్‌స్టేషన్‌లో మహిళా దినోత్సవం నిర్వహించారు. సీఐ కె.మంగాదేవి, ఏఎస్సై ఎస్.సీత, కానిస్టేబుళ్లు కె.కల్యాణి, కె.లక్ష్మి, కె.సావిత్రి, కె.వెంకటలక్ష్మి, వి.దీనకుమారిలను ఘనంగా సన్మానించారు. అన్ని రంగాలలోనూ మహిళలు అందిస్తున్న సేవలను అసోసియేషన్ అధ్యక్షుడు తెల్లమేకల సూర్యకృష్ణ, కార్యదర్శి ఎస్‌కే సిద్ధూ, కోశాధికారి ఏ.అశోక్‌బాబు తదితరులు కొనియాడారు. కార్యక్రమంలో అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు పి.సత్యనారాయణ, రూరల్ మండల ఉపాధ్యక్షుడు వీవీ రమణ పాల్గొన్నారు.
- పెన్షనర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం సాయంత్రం ధవళేశ్వరం పెన్షనర్స్ అసోసియేషన్ కార్యాలయం వద్ద విశ్రాంత మహిళా ఉద్యోగులు బండారు లక్ష్మి, దువ్వూరి సుబ్బలక్ష్మిలను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో అసోసియేషన్ నాయకులు దాసరి సాయిబాబా, యర్రమోతు ధర్మరాజు పాల్గొన్నారు.

జగన్ పాలనలో ప్రతిరోజూ పండగే

సీటీఆర్ఐ: ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి పాలనలో మహిళలకు ప్రతిరోజు పండగే అని రుడా చైర్‌పర్సన్ మేడపాటి షర్మిలారెడ్డి అన్నారు. కందుకూరి రాజ్యలక్ష్మి ప్రభుత్వ మహిళా కళాశాల వద్ద ఉన్న జగనన్న మహిళా హెవెన్ వద్ద బుధవారం ఉదయం ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, వసతి గృహం విద్యార్థినులతో కలిసి ఆమె హోలీ సంబరాలు, మహిళా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మహిళలు ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. మహిళల రక్షణ, అభ్యున్నతికి సీఎం జగన్ అనేక చట్టాలు, పథకాలు ప్రవేశపెట్టారన్నారు. రుడా నిధులతో జగనన్న హెవెన్ నిర్మించాక 24 గంటలు పోలీసు ఉంటున్నారని, ఈ ఏడాది కాలంలో ఈ ప్రాంతంలో నేరాలు తగ్గాయని పలువురు తనకు ఫోన్లు చేసి చెప్పడం సంతోషం కలిగిస్తోందన్నారు. కార్యక్రమంలో హెచ్ డబ్ల్యూఓ పి.దేవీత్రివేణి పాల్గొన్నారు.

అన్ని రంగాల్లో ముందుండాలి



రాజమహేంద్రి కళాశాలలో మహిళలకు సత్కారం

రాజమహేంద్రవరం సిటీ: మహిళలు అన్నిరంగాల్లో ముందుండి స్వతంత్రంగా వ్యవహరించాలని రాష్ట్ర గాండ్ల, తెలుకుల కార్పొరేషన్ చైర్‌పర్సన్ సంకీస భవానీ ప్రియ అన్నారు. గోకవరం బస్టాండ్ వద్ద గల రాజమహేంద్రి మహిళా జూనియర్, డిగ్రీ, పీజీ కళాశాలలో బుధవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సీఎం జగన్ ప్రభుత్వంలో మహిళా సాధికారత సాకారం అయ్యిందన్నారు. మరో ముఖ్య అతిథి వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకురాలు పోలు విజయలక్ష్మి మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే మహిళలు క్రమశిక్షణతో లక్ష్య సాధనకు కృషి చేయాలన్నారు. కళాశాల సెక్రటరీ కరస్పాండెంట్ టీకే విశ్వేశ్వరరెడ్డి మాట్లాడుతూ స్త్రీ విద్యతోనే సమాజాభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ తేతలి సత్య సౌందర్య మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాలలో పురోగమించి బాగా స్థిరపడినప్పుడే మహిళా సాధికారత సాధించినట్లు అవుతుందన్నారు. అనంతరం పలువురు మహిళలను సత్కరించారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు సావిత్రి, లక్ష్మి, రాజ సునీత, గౌరీ కుమారి, దివ్య పాల్గొన్నారు.

మైనార్టీల సంక్షేమానికి కృషి



బషీరుద్దీన్‌ను సత్కరిస్తున్న జక్కంపూడి రాజా తదితరులు

సీటీఆర్ఐ: మైనార్టీల సంక్షేమానికి కృషి చేస్తానని వైఎస్సార్ సీపీ మైనార్టీ సెల్ ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల జోనల్ ఇన్‌చార్జి, ఏపీ వక్ఫ్‌బోర్డ్ డైరెక్టర్ అబ్దుల్ బషీరుద్దీన్ అన్నారు. వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, రాజానగరం ఎమ్మెల్యే జక్కంపూడి రాజాను ఆయన బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా బషీరుద్దీన్‌ను జక్కంపూడి రాజా సత్కరించారు. కార్యక్రమంలో జిల్లా వక్ఫ్‌బోర్డు అధ్యక్షుడు ఆరిఫ్ తదితరులు పాల్గొన్నారు.

అగ్నిప్రమాద బాధితురాలికి ఆర్థిక సాయం



బాధితురాలికి ఆర్థిక సాయం అందజేస్తున్న వైఎస్సార్ సీపీ కోఆర్డినేటర్ చందన నాగేశ్వర్

ధవళేశ్వరం: అగ్నిప్రమాదంలో సర్వం కోల్పోయిన ధవళేశ్వరం సచివాలయం -2 పరిధిలోని సుబ్బాయమ్మ పేటకు చెందిన సిద్ధనాటి బాపనమ్మకు వైఎస్సార్ సీపీ కో ఆర్డినేటర్ చందన నాగేశ్వర్ బుధవారం ఆర్థిక సాయం అందజేశారు. షార్ట్ సర్క్యూట్ కారణంగా మంగళవారం బాపనమ్మ ఇల్లు దగ్ధమైంది. ఈ విషయం తెలుసుకున్న చందన నాగేశ్వర్ బాపనమ్మను పరామర్శించి ఆర్థిక సాయంతో పాటు నిత్యావసర సరుకులు అందించారు. భర్త చనిపోవడంతో ఒంటరిగా నివసిస్తున్న బాపనమ్మ అక్కడే తాత్కాలికంగా ఉండేందుకు షెడ్ నిర్మించుకునేలా చూడాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఆయన వెంట ఎస్వీ శేఖర్, కన్వీనర్ తలారి ప్రసాద్, గూటం రాజు, నంబూరి రవి, పెయ్యల రాజేష్, పెన్నాడ జయప్రసాద్ ఉన్నారు.

జక్కంపూడి గణేష్‌కు సత్కారం



జక్కంపూడి గణేష్‌ను సత్కరిస్తున్న శ్రీనివాసులురెడ్డి తదితరులు

రాజమహేంద్రవరం రూరల్: ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల యువజన విభాగం జోనల్ ఇన్‌చార్జిగా నియమితులైన జక్కంపూడి గణేష్‌ను బుధవారం ఘనంగా సత్కరించారు. ప్రముఖ న్యాయవాది, గొందేశి పూర్ణచంద్రారెడ్డి చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకులు గొందేశి శ్రీనివాసులు రెడ్డి, వైఎస్సార్‌సీపీ ట్రేడ్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు ముద్దాల అను, హితకారిణి సమాజం డైరెక్టర్ దేవులపల్లి సరితారాణి, కడియం, రూరల్ మండల జేసీఎస్ కన్వీనర్లు తాడాల విష్ణుచక్రవర్తి, తాటికొండ విష్ణుమూర్తి తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా జక్కంపూడి గణేష్ మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ బలోపేతానికి యువత కృషి చేయాలని పిలుపునిచ్చారు.

మహిళా జైలులో న్యాయవిజ్ఞాన సదస్సు



సదస్సులో మాట్లాడుతున్న న్యాయమూర్తి ప్రత్యూష కుమారి

కంబాలచెరువు: అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కె.ప్రత్యూష కుమారి ఆధ్వర్యంలో బుధవారం ప్రత్యేక మహిళా కారాగారంలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళల హక్కులు, బాధ్యతల గురించి ఆమె మహిళా ఖైదీలకు తెలియజేశారు. కార్యక్రమంలో ప్రత్యేక మహిళా కారాగార సూపరింటెండెంట్ వసంత కుమారి, సిబ్బంది పాల్గొన్నారు.

- హరిత దళం ఎన్‌జీవో సహకారంతో వేస్ట్ పిక్కర్ మహిళలకు స్థానిక సెయింట్ జాన్స్ కాలేజ్ ఆఫ్ ఎడ్యుకేషన్‌లో న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. వారికి వివిధ చట్టాలపై అవగాహన కల్పించడంతో పాటు మెరుగైన సమాజ నిర్మాణంలో మహిళలది కీలక పాత్ర అని ప్రత్యూష కుమారి వివరించారు. కార్యక్రమంలో వివిధ ఎన్‌జీవో సంస్థలు, వారి ప్రతినిధులు, చెత్త సేకరించే మహిళలు పాల్గొన్నారు.

బూరుగుపూడిలో శిలువ మార్గం

మధురపూడి: కోరుకొండ మండలం బూరుగుపూడి ఆర్‌సీఎం చర్చి ఆధ్వర్యంలో బుధవారం శిలువ మార్గం నిర్వహించారు. ఏసుక్రీస్తు శ్రమలను అనుభవించి, శిలువపై మరణించిన శ్రమకాలాన్ని పురస్కరించుకొని ఈ 45 రోజుల్లో ప్రత్యేక ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహిస్తారు. దానిలో భాగంగా రెవరెండ్ ఫాదర్ మనోజ్ కుమార్ నిర్వహణలో 14 స్థలాల శిలువ మార్గాన్ని నిర్వహించారు. చర్చి నుంచి ప్రారంభమై అంబేడ్కర్ వీధి, బాబూ జగ్జీవన్ రామ్ వీధి మీదుగా అల్లూరి సీతారామరాజు కాలనీ వరకూ జరిగింది.

బాధిత కుటుంబాలకు ఎమ్మెల్యే రాజా పరామర్శ

సీతానగరం: నాగంపల్లి ఎంపీటీసీ బిడిసే లక్ష్మి భర్త గంగాధర్ బుధవారం ఉదయం అనారోగ్యంతో మృతి చెందారు. ఈ నేపథ్యంలో ఎంపీటీసీ లక్ష్మిని ఎమ్మెల్యే జక్కంపూడి రాజా పరామర్శించారు. గంగాధర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వంగలపూడిలో చవ్విడి చిట్టియ్య, కాజా చంటబ్బాయి, చిక్కాల సూరిబాబు, పట్నాల రమణమ్మ, తాడివలస అప్పారావు, సిగిరిపల్లి ఏసు ఇటీవల మృతి చెందారు. వారి కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే జక్కంపూడి రాజా పరామర్శించారు. రామచంద్రపురంలో ఇటీవల మృతి చెందిన చంటమ్మ కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయన వెంట ఎంపీపీ గుర్రాల జ్యోత్స్న, జెడ్పీటీసీ చల్లమళ్ల వెంకటలక్ష్మి, నియోజకవర్గం బూత్ కమిటీల చైర్మన్, పార్టీ చేరికల కమిటీ కన్వీనర్ గద్దె వెంకటకృష్ణ చౌదరి (నల్లి), చల్లమళ్ల సుజీరాజు, మన్నెలి వెంకట్రావు ఉన్నారు.

ప్రకృతి వ్యవసాయంతో ఆరోగ్యకర జీవనం

రాజానగరం: ప్రకృతి వ్యవసాయం ద్వారా పండించే పంటలతోనే మానవ జీవన విధానం ఆరోగ్యంగా ఉంటుందని వ్యవసాయ శాఖ జిల్లా సహాయ సంచాలకులు బోసుబాబు అన్నారు. నరేంద్రపురంలో రైతులతో బుధవారం నిర్వహించిన సమావేశంలో ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కలిగిస్తూ, తద్వారా చేకూరే ప్రయోజనాలను వివరించారు. తొలకరి పంటకు ముందుగా పచ్చిరొట్ట, పప్పుజాతి, తీగజాతి, ఆకుకూర, కూరగాయల విత్తనాలను ఎకరానికి 13 కిలోల చొప్పున చల్లుకుంటే భూమి సారవంతమవుతుందని డీపీఎంయూ (డిస్ట్రిక్ట్ ప్రోగ్రామ్ మేనేజ్‌మెంట్ యూనిట్) జిల్లా ప్రాజెక్టు మేనేజర్ తాతారావు, డీటీ గౌతమ్ తెలిపారు. ఇంటి పెరటిలో కూరగాయల మొక్కలను, పాదులను కూడా ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో సాగుచేయాలన్నారు. అనంతరం క్షేత్ర సందర్శన చేసి, ఎంపిక చేసిన 10 మంది రైతులతో 30 ఎకరాలలో 30 రకాల పచ్చిరొట్ట విత్తనాలను చల్లించారు. కార్యక్రమంలో ఆర్‌బీకే సిబ్బందితో పాటు ఎంటీ దుర్గాదేవి, ఎస్‌డీఏ వీరవెంకట్రావు, రైతులు పాల్గొన్నారు.

మహిళను కాపాడిన కానిస్టేబుల్

ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ పైనుంచి గోదావరిలో పడిపోయిన మహిళను ధవళేశ్వరం కానిస్టేబుల్ డి.శ్రీనివాస్ స్థానికుల సాయంతో కాపాడారు. వివరాలు ఇలా ఉన్నాయి. కుతుకులూరుకు చెందిన అయినవల్లి రాజేశ్వరికి మతిస్థిమితం లేదు. ఈ నేపథ్యంలో ఆమె బుధవారం సాయంత్రం కాటన్ బ్యారేజీ దగ్గర గోదావరిలో పడిపోయింది. విషయం తెలుసుకున్న కానిస్టేబుల్ శ్రీనివాస్ ఆమెను రక్షించి, కుటుంబ సభ్యులకు అప్పగించారు.

గుర్తుతెలియని వ్యక్తుల దాడి

కంబాలచెరువు: స్థానిక పేపరుమిల్లు డంపింగ్‌యార్డు వద్ద గుర్తుతెలియని నలుగురు వ్యక్తులు దాడి చేసి రూ.30 వేలు అపహరించిన ఘటనపై మూడో పట్టణ పోలీస్‌స్టేషన్లో బుధవారం కేసు నమోదైంది. వివరాలు.. తాళ్లపూడికి చెందిన ప్రసన్నకుమార్ కొద్దిరోజుల క్రితం తన అమ్మమ్మ ఇంటికి రాజమహేంద్రవరం వచ్చాడు. మంగళవారం సాయంత్రం తొర్రేడు వెళ్లి తిరిగి వస్తుండగా పేపరుమిల్లు డంపింగ్‌యార్డు వద్ద గుర్తుతెలియని వ్యక్తులు అతడిపై దాడి చేసి, రూ.30 వేలు లాక్కుని పరారయ్యారు. ఈ ఘటనలో గాయపడిన ప్రసన్నకుమార్ ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఆస్పత్రిలోని అవుట్ పోస్టు పోలీసుల ఎంఎల్‌సీ ఆధారంగా మూడో పట్టణ పోలీసులు కేసు నమోదు చేశారు.

మహిళపై కేసు

సీతానగరం: వెదుళ్లపల్లికి చెందిన డ్వాక్రా మహిళ బొర్రా సుబ్బలక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు గోలి చంద్రపై కేసు నమోదు చేశామని ఎస్సై కె.శుభశేఖర్ బుధవారం తెలిపారు. వెదుళ్లపల్లిలోని కృపాకిరణ్ మహిళా శక్తి సంఘం కార్యదర్శి గోలి చంద్ర.. సంఘం సభ్యుల నుంచి వాయిదాలు కట్టడానికి రూ 13,500 వసూలు చేసి, రూ.1,800 మాత్రమే బ్యాంక్‌లో కట్టారని, మిగిలిన సొమ్మును చెల్లించలేదని సుబ్బలక్ష్మి ఫిర్యాదు చేశారన్నారు.